# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి :02 సంచిక :65 ఆదివారం 30-11-2025 పేజీలు:4 వెల :2/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

రిపోర్టర్లు కావలెను

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## తెలంగాణలో హిస్టరీలోనే అతిపెద్ద సైబర్ మోసం..



- తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద సైబర్ మోసం
- పెట్టుబడుల పేరుతో బురిడీ
- హైదరాబాద్ వైద్యుడికి రూ. 14.61 కోట్ల నష్టం

నకిలీ షేర్ ట్రేడింగ్ పెట్టుబడుల పేరుతో హైదరాబాద్ వైద్యుడు రూ. 14.61 కోట్లు పోగొట్టుకున్నాడు. ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరిచయమైన మహిళ.. నమ్మించి పెట్టుబడులు పెట్టించి, చివరికి పన్నుల పేరుతో భారీ మొత్తాన్ని డిమాండ్ చేసింది. విద్యాధికులు సైతం ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో సైబర్ నేరాల తీవ్రత పెరుగుతున్న తీరుకు అద్దం పడుతూ.. విద్యాధికులు సైతం నకిలీ పెట్టుబడి పథకాలకు బలవుతున్న ఒక సంచలన కేసు వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఓ వైద్యుడు నకిలీ షేర్ ట్రేడింగ్ పెట్టుబడుల పేరుతో ఏకంగా రూ. 14.61 కోట్లు పోగొట్టుకున్నారు. రాష్ట్ర చరిత్రలో ఒకే సైబర్ మోసంలో ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (%+జూదీ%) నమోదు చేసిన కేసు వివరాల ప్రకారం.. ఈ మోసం గత ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా మొదలైంది. 'మోనికా మాధవన్' అనే పేరుతో పరిచయమైన మహిళ.. తన వ్యక్తిగత సమస్యలు, విడాకుల కేసు గురించి చెప్పి తొలుత వైద్యుడితో సానుభూతిని పెంచుకుంది. ఆ తర్వాత సంభాషణలను టెలిగ్రామ్ ఐడీకి మార్చి.. తనకు షేర్ ట్రేడింగ్‌లో ఐదేళ్లకు పైగా అనుభవముందని సీఎంసీ మార్కెట్లలో రోజూ లక్షల్లో సంపాదిస్తున్నానని నమ్మబలికింది. తనలా ట్రేడింగ్ చేసేందుకు రిజిస్టర్ చేసుకోవాలంటూ ఒక నకిలీ వెబ్‌సైట్ లింక్‌ను పంపించింది. సెప్టెంబర్ 30న తొలి పెట్టుబడి రూ. 30 లక్షలు పెట్టాలని ఒప్పించగా.. మొదటి ట్రేడ్‌లోనే వర్చువల్ ఖాతాలో రూ. 8.6 లక్షల లాభం కనిపించింది. అటుపై రూ. 85 వేలు ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వడంతో వైద్యుడికి పూర్తిగా నమ్మకం కుదిరింది. లాభాలు మరింత ఆశించిన వైద్యుడు, సదరు మహిళ ఒత్తిడికి తలొగ్గి బ్యాంకు రుణాలతోపాటు స్నేహితుల వద్ద అప్పులు చేసి సుమారు రూ. 14 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు. దీంతో అతడి వర్చువల్ ఖాతాలో రూ. 34 కోట్ల మేర నగదు నిల్వ ఉన్నట్లు చూపించింది. అయితే, ఈ మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించగా, పన్నుల కింద ఏకంగా రూ. 7.5 కోట్లు చెల్లించాలని నేరగాళ్లు డిమాండ్ చేశారు. వైద్యుడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. మోనికా తన వాటాగా 50 శాతం పన్నును చెల్లిస్తానని.. మిగిలిన రూ. 3.75 కోట్లు చెల్లించాలని ఒత్తిడి చేసింది. ఆ సమయంలో సీఎంసీ ప్రతినిధులు పంపించిన డాక్యుమెంట్లు అసంబద్ధంగా అనిపించడంతో అనుమానం వచ్చిన వైద్యుడు గట్టిగా నిలదీయగా మోనికా స్పందించడం మానేసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం ఫిర్యాదు చేయగా.. టీజీసీఎస్‌బీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ తరహా 'ట్రేడింగ్/పెట్టుబడి' మోసాల పట్ల విద్యాధికులు సైతం అత్యంత జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో చిలుకూరు జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు జిల్లా ఫస్ట్




క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు నవంబర్ 29 చిలుకూరు మండల రిపోర్టర్ :-

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక వారు ప్రతి సంవత్సరం విద్యార్థులలో సైన్స్ ప్రతిభను వెలికితీయడానికి పాఠశాల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాల బోయిన రవి, శ్రీరామ్, పి చైత్రలు ప్రథమ స్థానం సంపాదించినట్లు పాఠశాల జిహెచ్ఎం ఏ కరుణాకర్ రెడ్డి జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పుట్టపాక అంజయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో క్వాలిటీ ఎడ్యుకేషన్, ఎంతో క్రమశిక్షణ, ఆట, పాటలు అందించడం ద్వారా ప్రతి సంవత్సరం మన పాఠశాల విద్యార్థులు పరీక్ష ఏదైనా జిల్లాలో ప్రథమ స్థానం సంపాదిస్తున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల్ని ఉపాధ్యాయులని అభినందించారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సర్పంచ్ బరిలో..




కరీంనగర్ జిల్లా నాగులమల్యాల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మల్యాల జాహ్నవి పోటీ చేస్తున్నారు. లక్షల్లో జీతం, విలాసవంతమైన జీవితాన్ని వదిలి.. గ్రామంలోని తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్ల సమస్యల పరిష్కారానికి ఆమె ముందుకు వచ్చారు. యువత గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామ సర్పంచ్‌గా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బరిలోకి దిగింది. వారానికి ఐదు రోజులు మాత్రమే పని, ఏసీ ఆఫీస్‌లో విధులు, ఇంటి నుంచి కార్యాలయానికి క్యాబ్ సదుపాయం, లక్షల్లో జీతం వంటి విలాసవంతమైన జీవితాన్ని వదిలేసి స్థానిక సమరానికి సై అంటోంది. తన ఉద్యోగానికి రిజైన్ చేసి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. గ్రామానికి చెందిన మల్యాల జాహ్నవి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసేందుకు శుక్రవారం నామపత్రం దాఖలు చేశారు. జాహ్నవి నిర్ణయం వెనుక సామాజిక నేపథ్యం ఉంది. ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయాలలో విద్యార్థి నాయకురాలిగా చురుకుగా పనిచేసిన అనుభవం ఉంది. ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు లభించినప్పటికీ.. తన సొంత గ్రామంలో నెలకొన్న సమస్యలు ఆమెను ప్రజాసేవ వైపు నడిపించాయి. గ్రామంలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, మెరుగైన రోడ్లు వంటి మౌలిక వసతుల లేమి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయానని జాహ్నవి.. వాటిని పరిష్కరించేందుకు కేవలం అధికారిక నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో నిలబడి అభివృద్ధి కోసం కృషి చేసేందుకు సర్పంచ్ బరిలో నిలిచింది. యువత గ్రామ రాజకీయాల్లోకి రావడం ద్వారా పారదర్శకత, ఆధునిక ఆలోచనలు పెరిగి, గ్రామాభివృద్ధి వేగం పుంజుకుంటుందని ఆమె గట్టిగా నమ్ముతున్నారు. ఈ సాహసోపేతమైన నిర్ణయం ఇతర యువతకు కూడా స్ఫూర్తినిస్తుందని, పట్టణ జీవితంలోని భద్రతను వదులుకుని గ్రామ సేవకు అంకితమైన జాహ్నవి విజయం సాధించాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆమె నామినేషన్ గ్రామంలో కొత్త రాజకీయ చర్చకు తెర తీసింది. ఇక పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల హడావుడి మ్నొదలైంది. మ్నొత్తం మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా.. పోలింగ్ తర్వాత వెంటనే ఫలితాలు వెల్లడికానున్నాయి. మ్నొదటి విడద నామినేషన్ల ప్రక్రియ ఈనెల 27న ప్రారంభం కాగా.. నేటితో నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కానుంది. దీంతో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు.. నేడు చివరి రోజు భారీగా నామినేషన్లు వేస్తున్నారు. ఇవాళ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉండటంతో మంది, మార్బలంతో ర్యాలీలు తీస్తూ నామినేషన్లు దాఖలు చేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్.. నీకు 70 ఏళ్లు వచ్చినా కూడా ముఖ్యమంత్రి కాలేవు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల కోనసీమపై చేసిన వ్యాఖ్యలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఎప్పుడూ ఏపీ సంక్షేమాన్ని కోరుకుంటుందని.. రాష్ట్ర విభజన అభివృద్ధికి అడ్డంకి అనడం అవమానకరమని అనిరుధ్ రెడ్డి అన్నారు. తెలంగాణ గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని... పవన్ కల్యాణ్ తక్షణమే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేయవద్దని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే సృష్టించాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాల పచ్చదనం, రాష్ట్ర విభజన, కోనసీమపై చేసిన వ్యాఖ్యలపై అధికార, విపక్ష నేతల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఈ వ్యాఖ్యలపై కౌంటర్ ఇవ్వగా.. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పవన్ కల్యాణ్‌పై అత్యంత ఘాటుగా మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఇటీవల మాట్లాడుతూ..


## పవన్ కళ్యాణ్.. నీకు 70 ఏళ్లు వచ్చినా కూడా ముఖ్యమంత్రి కాలేవు



"గోదావరి జిల్లాల పచ్చదనం వల్లే రాష్ట్రం విడిపోయింది" అని, "తెలంగాణ నాయకుల నర దిష్టి తాకడం వల్లే గోదావరి జిల్లాల్లో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఈ నిరాధారమైన విమర్శలు తెలంగాణ నాయకులకు ఆగ్రహం తెప్పించాయి. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ.. తెలంగాణ ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికే మద్దతు ఇస్తుందని.. రెండు రాష్ట్రాలు సౌహార్దంతో ఎదగాలని కోరుకుంటుందని చెప్పారు. కానీ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర విభజనే అడ్డంకి అని పవన్ వ్యాఖ్యానించడం అవమానకరమని అనిరుధ్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. అనిరుధ్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. 'పవన్ కళ్యాణ్.. నువ్వు 70 ఏళ్లు వచ్చినా కూడా ముఖ్యమంత్రి కాలేవు. నిన్ను ప్యాకేజ్ స్టార్ అంటారు. నీకు దమ్ముంటే తెలుగుదేశం పార్టీని వదిలిపెట్టి ఒంటరిగా పోటీ చెయ్' అంటూ ఘాటుగా విమర్శించారు. 'తెలంగాణ వాళ్ల నర దిష్టి తగిలినందుకే కోనసీమ కొబ్బరి చెట్లు మొండెం లేకుండా అయ్యాయి అని పవన్ కళ్యాణ్ అంటున్నారు. నిజంగా తెలంగాణ వాళ్ళకి నర దిష్టి, ఇతరులు బాగు పడొద్దు అనే ఉద్దేశం ఉంటే.. ఆంధ్ర వాళ్లు ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటారా?" అని అనిరుధ్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఇరిగేషన్, కన్‌స్ట్రక్షన్ సహా అన్ని రంగాల్లో ఆంధ్ర వాళ్ళు ఉన్నారు.. అయినా మేము ఒక్క మాట కూడా అంటున్నామా..? అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రకు డిప్యూటీ సీఎం అయ్యాడు.. కానీ ఉండేది, వ్యాపారం చేసుకునేది మాత్రం తెలంగాణలోనే. "మాది నర దిష్టి అయితే హైదరాబాద్‌లో ఎందుకు ఆస్తులు కొంటున్నారు? ఇక్కడ ఉన్నవన్నీ అమ్ముకొని పోయి విజయవాడలో ఉండండి" అని ఆయన సవాల్ విసిరారు. తాను కూడా పవన్ కళ్యాణ్‌కు అభిమానినేనని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. "ఆయన ఓజీ (ఓ జి) సినిమా ఫ్లాప్ అయినా కూడా.. ప్రొడ్యూసర్ బతకాలని రూ.800 టికెట్ రేట్ ఉన్నా నేను పోయి చూశా. కానీ.. తప్పు మాట్లాడాడు కాబట్టి తప్పే" అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల గురించి లేదా తెలంగాణ ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని.. పవన్ కళ్యాణ్ తప్పు మాట్లాడాడు.. కాబట్టి భేషరతుగా క్షమాపణలు చెప్పాలి అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఇంటర్ అమ్మాయి.. 9వ తరగతి అబ్బాయి..






వనపర్తి జిల్లాలో 9వ తరగతి అబ్బాయి, ఇంటర్ బాలిక ప్రేమ పేరుతో పెట్టుకున్న సంబంధం కారణంగా బాలిక గర్భం దాల్చి, శిశువుకు జన్మనిచ్చింది. ఇద్దరూ మైనర్లు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసినా.. చర్యలకు వెనుకంజ వేశారు. గ్రామంలో పంచాయితీ పెట్టినా.. బాలుడి తల్లిదండ్రులు సంబంధం లేదని తేల్చిచెప్పారు. దీంతో న్యాయం కోసం బాలిక కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి.. శిశువుకు డీఎన్‌ఏ పరీక్ష చేయాలని డిమాండ్ చేశారు. మొబైల్ ఫోన్లు, పర్యవేక్షణ లోపం వంటి సామాజిక కారణాలపై ఈ ఘటన విశ్లేషణను కోరుతోంది. వనపర్తి జిల్లాలో జరిగిన ఒక అత్యంత దారుణమైన ఘటన సమాజాన్ని కలవరపరుస్తోంది. వనపర్తి మండల పరిధిలోని ఒక గ్రామంలో.. కేవలం 9వ తరగతి చదువుతున్న బాలుడు.. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక ప్రేమ పేరుతో పెట్టుకున్న సంబంధం.. ఒక శిశువు జననానికి దారితీసింది. ఇద్దరూ మైనర్లు కావడం.. ఆ బాలుడు కేవలం 9వ తరగతి విద్యార్థి కావడం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తున్నాయి. గ్రామానికి చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో వారు పలుమార్లు లైంగికంగా కలిశారు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. విషయాన్ని గుర్తించిన బాలిక తల్లిదండ్రులు వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 14వ తేదీన బాలిక ఒక శిశువుకు జన్మనిచ్చింది. గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా.. బాలుడి తల్లిదండ్రులు తమ అబ్బాయికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని తెగేసి చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇద్దరూ మైనర్లే కావడం, కేసు పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే అవకాశం ఉండటంతో చర్యలు తీసుకోవడానికి ఆలోచిస్తున్నారు. ఈ సందిగ్ధతతో పోలీసులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాలిక కుటుంబ సభ్యులు శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శిశువుకు డీఎన్‌ఏ (డిఎన్ఏ) పరీక్ష నిర్వహించి.. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రస్తుతం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. పిల్లలు ఈ విధంగా పెడదోవ పట్టడానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే అని చెప్పవచ్చు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో.. తల్లిదండ్రులు ఆర్థిక అవసరాల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా.. పిల్లలతో గడిపే సమయం తగ్గి, వారిపై శ్రద్ధ, నియంత్రణ కోల్పోతున్నారు. యుక్తవయస్సు మార్పుల గురించి, లైంగిక విద్య గురించి వారికి సరైన అవగాహన అందించడంలో కుటుంబ వ్యవస్థ విఫలమవుతోంది. తమ పిల్లలు ఎలాంటి మానసిక స్థితిలో ఉన్నారో, ఎలాంటి విషయాలపై ఆకర్షితులవుతున్నారో తెలుసుకోలేకపోవడం పెద్ద పొరపాటు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ విస్తృతం కావడం తర్వాతే ఇలాంటి అసాధారణ వ్యవహారాలు పెరిగినట్లు అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పర్యవేక్షణ లేని మొబైల్ వాడకం వలన.. అనైతిక, అసభ్యకరమైన దృశ్యాలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. టీనేజర్లలో ఉన్న ఉత్సుకత.. వారు ఇంటర్నెట్ లో చూసిన అంశాలను నిజ జీవితంలో ప్రయత్నించడానికి మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా.. లైంగిక ఆకర్షణను కేవలం శారీరక సంబంధంగానే పరిగణిస్తున్నారు.పాఠశాలల్లో విద్య మాత్రమే కాకుండా.. సామాజిక, నైతిక విలువల బోధన అవసరం. యుక్తవయస్సులో వచ్చే మార్పుల గురించి.. సురక్షిత లైంగిక విద్య గురించి కౌన్సిలింగ్ అందించాలి. ఈ రకమైన అవగాహన లోపం.. ఈ మైనర్లు లైంగిక సంబంధాన్ని కేవలం ఒక ఆటగా పరిగణించడానికి దారితీసి ఉండవచ్చు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ఈ ఘటనను ఒక హెచ్చరికగా స్వీకరించి.. పిల్లల మానసిక, నైతిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.

## సంక్రాంతికి చిరంజీవి అద్భుతమైన మ్యాజిక్ చేయబోతున్నారు..



2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో హిట్ కొట్టిన అనిల్ రావిపూడి.. ఈసారి 'మన శంకర వరప్రసాద్ గారు'తో వస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతారతో పాటు వెంకటేష్ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు. 'మీసాల పిల్ల' పాట ఇప్పటికే చార్ట్ బస్టర్ అయింది. ఈ సినిమాతో సంక్రాంతికి మెగా మ్యాజిక్ క్రియేట్ అవుతుందని అనిల్ ధీమా వ్యక్తం చేశారు. మరిన్ని సర్‌ప్రైజ్‌లు, పాటలు రానున్నాయని తెలుస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన డైరెక్టర్ అనిల్ రావిపూడి .. రాబోయే సంక్రాంతికి ' మన శంకర వరప్రసాద్ గారు ' చిత్రాన్ని రెడీ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, నయనతార హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ స్పెషల్ రోల్ లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మెగా అభిమానులను ఆకట్టుకుంది. 'మీసాల పిల్ల' పాట చార్ట్ బస్టర్ అయింది. తాజాగా ఈ సినిమాపై మరింత హైపెక్కించే స్టేట్మెంట్ ఇచ్చారు అనిల్ రావిపూడి. 2026 సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో పాటుగా ప్రభాస్ 'ది రాజాసాబ్', రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' చిత్రాలు రాబోతున్నాయి. వీటితో పాటుగా విజయ్ 'జన నాయకుడు', శివ కార్తికేయన్ 'పరాశక్తి' వంటి డబ్బింగ్ సినిమాలు కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి. అయితే ఎన్ని సినిమాలు వచ్చినా చిరంజీవి -వెంకటేష్ కాంబినేషన్ లో తాను చేస్తున్న సినిమా అద్భుతమైన మ్యాజిక్ క్రియేట్ చేస్తుందని డైరెక్టర్ అనిల్ రావిపూడి ధీమాగా ఉన్నారు. అనిల్ రావిపూడి ఓ మీడియా ఛానల్ తో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా గురించి మాట్లాడుతూ.. ''మీసాల పిల్ల పాటని ప్రేక్షకులు పెద్ద ఎత్తున రిసీవ్ చేసుకున్నారు. రిలీజైన నెల రోజుల్లోనే 70 మిలియన్ల వ్యూస్ క్రాస్ చేసింది. 100 మిలియన్ల దిశగా దూసుకుపోతోంది. ఈసారి సంక్రాంతికి చిరంజీవి గారితో ఒక అద్భుతమైన మ్యాజిక్ జరగబోతోందని అనుకుంటున్నాను. ఇందులో వెంకటేష్ గారు స్పెషల్ క్యామియో చేయబోతున్నారు. చాలా బాగుంటుంది. ఈసారి సంక్రాంతికి ఆడియన్స్ కి ఫుల్ మజా వస్తది. చిరంజీవి గారి స్ట్రాంగ్ జోన్ లో, నాకు ఇష్టమైన జోనర్ లో చూపించబోతున్నందుకు చాలా చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నాను. లాస్ట్ సంక్రాంతికి కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి ఒక మరిచిపోలేని ఎంజాయ్ మెంట్ తీసుకెళ్లారు. ఈసారి కూడా అంతే బాగా ఎంజాయ్ చేయబోతున్నారు. పొంగల్ కి ఈ సినిమాని మీకు చూపించడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని అనిల్ రావిపూడి అన్నారు. అనిల్ రావిపూడి మాటలు చూస్తుంటే ఈసారి పండక్కి కూడా గట్టిగా కొడతామని చాలా నమ్మకంగా ఉన్నట్లు అర్థమవుతోంది. షూటింగ్ స్టార్ట్ చేసినప్పుడే ప్రమోషన్స్ కూడా ప్రారంభించిన అనిల్..

## 'వారణాసి' బిగ్ అప్డేట్..



మహేష్ బాబు, ఎస్.ఎస్ రాజమౌళి కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా టైటిల్ విషయంలో చిన్న వివాదం తలెత్తింది. ఇప్పటికే వేరే నిర్మాణ సంస్థ ఈ టైటిల్ రిజిస్టర్ చేసుకోవడంతో, తెలుగులో పేరు మార్చాలని ఆలోచిస్తున్నారట. మిగతా భాషల్లో మాత్రం 'వారణాసి' అనే పేరుతోనే విడుదల చేయనున్నారట. సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'వారణాసి'. ఇది ఇండియన్ సినిమాలోనే భారీ బడ్జెట్ తో రూపొందుతోంది. %===% వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తర్వాత జక్కన్న నుంచి రాబోతున్న ఈ సినిమా కోసం యావత్ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి ఇటీవలే ఈ చిత్రం ఎలా ఉండబోతుందనేది శాంపిల్ గా చూపించారు. దీంతో అందరిలో అంచనాలు రెట్టింపు అయ్యాయి. తాజాగా ఈ మూవీ టైటిల్ కి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది.'ఎస్ ఎం బి 29' సినిమాకి 'వారణాసి' అనే టైటిల్ పెడుతున్నారని టాక్ బయటకు వచ్చినప్పుడు, అదే పేరుతో ఓ చిన్న చిత్రాన్ని ప్రకటించడం ఆ మధ్య హాట్ టాపిక్ అయింది. రామభక్త హనుమా క్రియేషన్స్ బ్యానర్‌లో సీహెచ్ సుబ్బారెడ్డి దర్శకత్వంలో ఈ సినిమా అనౌన్స్ చేయబడింది. రాజమౌళి కంటే ముందే 'వారణాసి' టైటిల్ ని రిజిస్టర్ చేయించుకున్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై మహేష్ బాబు టీం ఎలా స్పందిస్తుందో అనే చర్చలు జరుగుతున్నా తరుణంలో, తాజాగా ఈ టైటిల్ వివాదం క్లియర్ అయినట్లు తెలుస్తోంది. 'వారణాసి' సినిమాని భారతీయ భాషలతో పాటుగా పలు ఇంటర్నేషనల్ లాంగ్వేజెస్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే తెలుగు టైటిల్ విషయంలోనే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఎందుకంటే తెలుగులో వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేయించుకుంది. అందుకే ఇప్పుడు మహేష్ బాబు మూవీ తెలుగు టైటిల్ లో చిన్న మార్పు చేయాలని భావిస్తున్నారట. ' రాజమౌళి వారణాసి ' అనే పేరుతో విడుదల చేయాలని అనుకుంటున్నారట. మిగిలిన భాషల్లో మాత్రం 'వారణాసి' అనే పేరుతోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు టాక్ వినిపిస్తోంది. గతంలో మహేష్ బాబు నటించిన 'ఖలేజా' సినిమా టైటిల్ విషయంలో ఇలాంటి వివాదమే వచ్చింది. ఆల్రెడీ ఆ టైటిల్ రిజిస్టర్ చేసుకున్న నిర్మాతలు కోర్టుకు వెళ్లడంతో.. 'మహేష్ ఖలేజా'గా పేరు మార్చారు. ఇటీవల 'కుబేర' టైటిల్ పై వివాదం చెలరేగడంతో, 'శేఖర్ కమ్ముల కుబేర' పేరుతో రిలీజ్ చేశారు. ఇప్పుడు 'వారణాసి' చిత్రాన్ని తెలుగులో 'రాజమౌళి వారణాసి' టైటిల్ తో విడుదల చేస్తారని అంటున్నారు.

## రామ్ పోతినేనినే నమ్ముకున్న భాగ్యశ్రీ..



రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మహేశ్ బాబు. పి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 27న రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ మెటీరియల్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాపై రామ్, భాగ్యశ్రీ బోలెడన్ని ఆశలు పెట్టుకున్నారు. తప్పకుండా హిట్టు కొడతామని నమ్మకంగా ఉన్నారు. సినీ ఇండస్ట్రీలో సక్సెస్ ఒక్కటే మాట్లాడుతుంది. హీరోలకి ఫ్లాపులు వచ్చినా పర్వాలేదు కానీ, హీరోయిన్లకు ఫెయిల్యూర్స్ వస్తే మాత్రం నిలదొక్కుకోవడం చాలా కష్టం. ఒక్క ఫ్లాప్ పడితే ఐరన్ లెగ్ ముద్ర వేసి పక్కన పెట్టేస్తారు. కానీ భాగ్యశ్రీ బోర్సే విషయంలో దానికి కంప్లీట్ రివర్స్ జరుగుతోంది. ఆమె డెబ్యూ మూవీ 'మిస్టర్ బచ్చన్' డిజాస్టర్ గా మారింది. రెండో సినిమా 'కింగ్డమ్' ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఇందులో భాగ్యశ్రీ పాత్ర హీరోయిన్ కి తక్కువ క్యారక్టర్ ఆర్టిస్టుకి ఎక్కువ అన్నట్లు ఉంది. ఇటీవల వచ్చిన 'కాంత' సినిమా కూడా అమ్మడికి హిట్టు అందించలేకపోయింది. ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి కానీ.. బాక్సాఫీస్ దగ్గర వసూళ్లు రాలేదు. దీంతో ఇప్పుడు 'ఆంధ్ర కింగ్ తాలూకా' మూవీపైనే ఆశలు పెట్టుకుంది. రామ్ పోతినేని హీరోగా నటించిన ఈ సినిమా గురువారం (నవంబర్ 27) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ పంచుకున్న ఈ జంట.. ఆఫ్ స్క్రీన్ లో డేటింగ్ చేస్తున్నారనే రూమర్స్ వినిపిస్తున్న వేళ, వీరిద్దరి కెరీర్ కి ఈ సినిమా కీలకంగా మారింది. భాగ్యశ్రీతో పాటుగా రామ్ కూడా గత కొంతకాలంగా వరుస ఫ్లాప్స్ లో ఉన్నాడు. అందుకే ఈసారి కచ్చితంగా హిట్టు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ ఆకట్టుకుంది. మరి రామ్, భాగ్యశ్రీకి హిట్టు 'భాగ్యం' దక్కుతుందేమో చూడాలి.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jaganannna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com